# సత్యవాక్కు

సంపుటి - 41 డిశెంబర్ - 2019 సంచిక - 5

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

DECEMBER - 2019

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతి శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanicoc.kkd లో**

పై కార్యక్రమములను చూడండి
మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.
ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**
P.O.BOX. 80, KAKINADA
PIN : 533004. Ph : 0884 - 2363722
98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884 - 2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

**సంపుటి - 41** **డిశంబర్ - 2019** **సంచిక - 5**


## క్రీస్తు సంఘమే దేవుని యిల్లు

### (The Church of Christ is the House of God)

అపో. పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 3:1-6లో యిట్లు ప్రకటించెను. "యిందువలన పరలోక సంబంధమైన పిలుపులో పాలు పొందిన పరిశుద్ధ సహోదరులారా, మనము ఒప్పుకొనిన దానికి అపొస్తలుడును, ప్రధాన యాజకుడు నైన యేసుమీద లక్ష్యముంచుడి. దేవుని యిల్లంతటిలో మోషే నమ్మకముగా ఉండినట్లు ఈయన కూడా తన్ను నియమించిన వానికి నమ్మకముగా ఉండెను. ప్రతియిల్లును ఎవడైన ఒకని చేత కట్టబడును; సమస్తమును కట్టినవాడు దేవుడే. ... మోషే పరిచారకుడై యుండి దేవుని యిల్లంతటిలో నమ్మకముగా ఉండెను. అయితే క్రీస్తు కుమారుడై యుండి, ఆయన యింటి మీద నమ్మకముగా ఉన్నాడు; ధైర్యమును నిరీక్షణ వలన ఉత్సాహమును తుదమట్టుకు స్థిరముగా చేపట్టిన యెడల మనమే ఆయన యిల్లు."

చదువబడిన ఈ వాక్య భాగ్యమును బట్టి దేవుని కొక యిల్లున్నదని, ఆ యింటిమీద క్రీస్తు నమ్మకముగా యుండెనని మనకు

అర్థమగు చున్నది. లేఖనములను బట్టి ఆ యిల్లు ఏ దైనదో ఈ రోజు కొంత తెలిసికొందము.

1 తిమోతి 3:15 లో ఇట్లు వ్రాయబడి యున్నది : "అయినను నేను ఆలస్యము చేసిన యెడల దేవుని మందిరములో అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియు వలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను. ఆ సంఘము సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్నది." దీనిని బట్టి దేవుని గృహము లేక మందిరమే దేవుని సంఘమని మనము గ్రహించుకొన గలము. అయితే ధైర్యమును, నిరీక్షణ వలన ఉత్సాహమును తుదమట్టుకు స్థిరముగా చేపట్టిన యెడల మనమే ఆయన యిల్లని పౌలు హెబ్రీయులకు వ్రాసెను. గనుక క్రైస్తవులు లేక క్రీస్తు సంఘమే దేవుని యిల్లని మనము తెలిసికొన గలుగుచున్నాము.

దేవుని గృహమును గూర్చిన ప్రముఖ సత్యములను ఇప్పుడు కొన్నింటిని తెలిసికొందము.

**దేవుని గృహమునకు లేక సంఘమునకు పునాది యేసుక్రీస్తు :** "వేయబడినది తప్ప మరియొక పునాది ఎవడును వేయ నేరడు, ఈ పునాది యేసుక్రీస్తే" అని 1 కొరింథీ 3:11 లో వ్రాయబడి యున్నది. యేసు పేతురుతో మాట్లాడుచు, "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నేను నీతో చెప్పుచున్నాను" అనెను (మత్తయి 16:18). దీనిని బట్టి పేతురుపై క్రీస్తు సంఘము నిర్మింప బడెనని అనేకులు తలంచెదరుగాని, పేతురు అను పదమునకు బండ కాదు గాని రాయి అని అర్థము. ఏ బండ మీద నయితే క్రీస్తు తన సంఘమును కట్టుదునని చెప్పెనో ఆ బండ ఆయనే గాని వేరొకడు కాదు అని 1 కొరింథి 10:4 వలన మనము గ్రహించుకొన గలము.

దేవుని యింటికి ముఖ్య మూలరాయికూడా క్రీస్తే. ఎఫెసులో యున్న క్రైస్తవులకు పౌలు యిట్లు వ్రాసెను : "కాబట్టి మీరిక మీదట పరజనులును పరదేశులునై యుండక పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటి వారునై యున్నారు. క్రీస్తుయేసే ముఖ్యమైన మూల రాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడి యున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధి పొం... ...ది. ఆయనలో మీరుకూడ ఆత్మ మూలముగా దేవునికి నివాస స్థలమై యుండుటకు కట్ట బడుచున్నారు" (ఎఫెసీ 2:19-22). మరల "యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలమగు ఆత్మ సంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు మీరును సజీవమైన రాళ్ళవలెనుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడు చున్నారు" అని అపొ. పేతురు ప్రకటించెను (1 పేతురు 2:5).

**దేవుని గృహమంతటికి తండ్రి దేవుడే:** "కావున మీరు వారి మధ్యనుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైన దానిని ముట్టకుడి యని ప్రభువు చెప్పుచున్నాడు. మరియు నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినై యుందును. మీరు నా కుమారులను, కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు" (2 కొరింథీ 6:18). "మరియు భూమిమీద ఎవనినైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి, ఆయన పరలోక మందున్నాడు" అని యేసు బోధించెను (మత్తయి 23:9).

దేవుని గృహమైయున సంఘమునకు శిరస్సు క్రీస్తే : "క్రీస్తు కుమారుడై యుండి ఆయన యింటి మీద నమ్మకముగా ఉన్నాడు" (హెబ్రీ 3:6). "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు, క్రీస్తే శరీరమునకు రక్షకుడై

యున్నాడు (ఎఫెసీ 5:23). "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధార భూతుడు. సంఘము అనే శరీర మునకు ఆయనే శిరస్సు" (కొలస్స 1:17, 18).

**దేవుని బిడ్డలే దేవుని గృహసభ్యులు :** "తన్ను ఎందరంగీ కరించిరో వారికందరికీ, అనగా ఆయన నామము నందు విశ్వాస ముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను" (యోహాను 1:12). "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించు కొనియున్నారు" (గలతీ 3:26, 27)

ఎవడైనను దేవుని కుమారుడు కావలెనంటే వాడు దేవునికుటుంబము లోనికి జన్మించవలెను. ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని దేవుని కుటుంబ సభ్యుడు కాలేడు. "ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించి తేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింప లేడని" యేసు బోధించెను. అంటే ఒకడు క్రీస్తు వాక్యము విని, విశ్వసించి, బాప్తిస్మము పొందితేనే గాని దేవుని కుటుంబ సభ్యుడు కానేరడు. దేవుని కుటుంబ సభ్యులను హెచ్చరించుచు అపొ. పేతురు ఇట్లు వ్రాసెను : "మీరు క్షయ బీజము నుండి కాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్య మూలముగా అక్షయ బీజము నుండి పుట్టింప బడినవారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్రపరచుకొనినవారై యుండి, యొకనినొకడు హృదయ పూర్వకముగాను మిక్కుటముగాను ప్రేమించుడి" (1 పేతురు 1:22, 23)

**దేవుని కుటుంబమంతయు దేవుని నామమును ధరించు కొనును :** "ఈ హేతువుచేత పరలోకము నందును, భూమి మీదను ఉన్న

ప్రతికుటుంబము ఏ తండ్రిని బట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రి యెదుట నేను మోకాళ్లూ నితినని" అపొ. పౌలు ఎఫెసీ 3:14లో వ్రాసెను. దేవుని సంఘమే దేవుని గృహము; విశ్వాస గృహము, దేవుని యిల్లు అని పిలువబడినది. "మేము దేవుని జతపనివారమై యున్నాము; మీరు దేవుని గృహమై యున్నారు" అని కొరింధులోని క్రైస్తవులకు అపొ. పౌలు వ్రాసెను (1కొరింధి 3:9). "కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము" అని గలతీ 6:10లో వ్రాయబడియున్నది. "తీర్పు దేవుని ఇంటి యొద్ద ఆరంభమగు కాలము వచ్చి యున్నది. అది మన యొద్దనే ఆరంభమయితే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేసువును"? అని 1 పేతురు 4:17లో వ్రాయబడి యున్నది.

దేవునికి ఒకే ఒక్క యిల్లున్నది. అదే ఆయన సంఘము. దానిలో దేవుడే తండ్రి, సభ్యులు ఆయన బిడ్డలు. యేసు సంఘముపై శిరస్సుగా యున్నారు, ఆ సంఘమునకు ఆయనే రక్షకుడు. రక్షింపబడిన ప్రతివారిని ప్రభువు తన సంఘముతో లేక దేవుని గృహముతో చేర్చును. నీవు దేవుని కుటుంబ సభ్యుడవా? అట్లయితే నీవు ఆయన నామమును ధరించు కొంటివా?

నీవు క్రీస్తు సంఘ సభ్యుడవు కాని యెడల దేవుని కుటుంబమునకు చెంద నేరవు. యేసు క్రీస్తునందు విశ్వాసముంచుము. పాపముల విషయమై మారు మనస్సు బొందుము, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పు కొనుచు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. ప్రభువు నిన్ను రక్షించి తన సంఘముతోను, కుటుంబముతోను నిన్ను చేర్చును. అప్పటి నుండి మరణ పర్యంతము ఆయనకు నమ్మకముగా సేవచేయుము.

# యేసు దేవుడై యున్నారు
## (Jesus is God)

దేవుడు తండ్రియైయున్నాడని అందరు అంగీకరింతురు. దైవత్వమును విశ్వసించు వారెవరైనను తండ్రియైన దేవుడు దేవుడని అంగీకరిస్తారు. అది వాస్తవమని మనం అంగీకరిస్తాము. అయితే యేసు దేవుడా, కాదా? యనునది ఇప్పుడు చూచుకొందము.

**యేసు నిత్యుడు :**

యేసు యొక్క పూర్వపు ఉనికిని నిత్యత్వాన్ని సూచించు ఒక లేఖనము యోహాను 1:1, "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను; వాక్యము దేవుడై యుండెను". వాక్యమునకు, దేవునికి యున్న ప్రత్యేకతను మనం గమనించగలము, ఏలయనగా వాక్యము దేవుని యొద్ద ఉండెను. దేవుడు తనతో యుండెనని చెప్పుట అవివేకము. అయినను వాక్యము దేవుడై యుండెనని అనగా ఆయన దేవుడై యుండెనని మనము చూడ గలము. అదే ప్రత్యేకతను మరల యోహాను 1:14లో మనము చూడగలము. ఆవాక్యము శరీర ధారియై యున్నట్లు అక్కడ చూడగలము. యిది క్రీస్తును సూచించు మాటయై యున్నది. 15వ వచనములో ఆయన నాకంటె ముందున్న వాడని బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పుచున్నాడు. యోహాను కంటే యేసు ముందునుండే యున్నవాడు. అయినను శారీరకంగా యోహాను పుట్టిన ఆరునెలల తరువాత యేసు ఈ లోకంలో జన్మించెను.

యోహాను 8:58లో అబ్రహాము పుట్టకమునుపే నేనున్నానని యేసు చెప్పెను ఉన్నాను. ఉండుననువాడను అను పదము నిర్గమ 3:14–15లో, నిత్యము వుండు స్వయం సంభూతుడైన యెహోవా దేవుని గూర్చి వాడబడిన పదము.

అబ్రహాము పుట్టకముందు నుండే యున్నవాడనని యేసు చెప్పుట మాత్రమే గాక, తండ్రియైన దేవునికి వర్తించు గుణమును తనకు ఆయన వర్తించుకొనెను. అట్లు స్వయం సంభూతుడైన దేవునితో తాను సమానుడని ఆయన సంబోధించు కొనెను.

యేసు పరలోకము నుండి వచ్చెను. యోహాను 3:13లో యేసు నీకొదేముతో మాట్లాడుచు, "పర లోకము నుండి దిగివచ్చిన వాడే పరలోకములో ఉండు మనుష్య కుమారుడే తప్ప పరలోకమున కెక్కిపోయిన వాడెవడును లేడు" అని చెప్పెను. మనుష్య కుమారుడు అనుపదము యేసు తన్ను గూర్చియే పలికెను. గనుక ఆయన ఈ లోకమునకు రాకముందు పరలోకమందున్న నజీవుడైన దేవుడనని తెలియజేసెను. యోహాను 6:51లో యేసు అట్టి మరియొక ప్రకటన చేసెను. "పరలోకము నుండి దిగివచ్చిన జీవాహారము నేనే". తదుపరి యోహాను 6:62లో "అలాగైతే మనుష్య కుమారుడు మునుపు వున్న చోటునకు ఎక్కుటమీరు చూచిన యెడల ఏమందురు?" అని ఆయన పలికెను. యేసు మరణించి తిరిగి లేచిన తరువాత, ఆయన ఈ లోకమునకు రాకముందున్న పరలోకమునకు ఎక్కిపోయెను.

మెస్సీయను గూర్చియున్న 110వ దావీదు కీర్తనను యూదులందరు అంగీకరించారు. "ప్రభువు నా ప్రభువుతో సెలవిచ్చిన వాక్కు -నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయువరకు నాకుడి పార్శ్వమున కూర్చుండుమని" మొదటి వచనము చెప్పుచున్నది. మొదటి ప్రభువు తండ్రియైన దేవుడు, రెండవ ప్రభువు మెస్సీయ. గనుక పరిశుద్ధాత్మ వలన దావీదు అప్పటికింకను జన్మించని తనవంశ కర్తను "ప్రభువు" అని పిలిచుచున్నాడు. అయితే ఈ మెస్సీయ దావీదు యొక్క ప్రభువును, తన వంశములో

జన్మించిన వాడును ఎట్లావుతాడు? ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి, "క్రీస్తును గూర్చి మీకేమితోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు ఆయన దావీదు కుమారుడని చెప్పిరి. అందుకాయన - అలగైతే నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద ఉంచువరకు నీవు నా కుడి పార్శ్వమున కూర్చుండమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను అని దావీదు ఆయనను ప్రభువని యేలచెప్పు చున్నాడు? దావీదు ఆయనను ప్రభువని చెప్పిన యెడల ఆయన ఏలాగు అతనికి కుమారుడగును అనివారినడిగెను" (మత్తయి 22:41-45). గనుక యేసు మెస్సీయ అయితే ఆయన పూర్వము నుండి యున్న వాడైయుండాలి. ఇంకో మాటలో దేవుడై ఉండియుండాలి! మెస్సీయను గూర్చియూదులు సరిగ గ్రహించనందున దీనిని వారు గ్రహించలేకపోయిరి.

దేవుని నామములు యేసుకు వర్తింపజేయబడ్డాయి

యెషయా 42:8లో యెహోవాను నేనే ఇదే నానామము. మరి ఎవరికిని నా మహిమను నేనిచ్చువాడను కాను" అని ఆయన పలికెను. పరిశుద్ధాత్మవేశము వలన మత్తయి వ్రాస్తు యెషయా 40:3ను ఎత్తిచూపెను. అక్కడ యెహోవా నామమును యేసు క్రీస్తుకు అతడు వర్తింపజేసెను (మత్త 3:3). తీతు 2:13లో మహాదేవుడును మన రక్షకుడైన యేసు క్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు మనము ఎదురు చూచుచుండవలెనని'' పౌలు హెచ్చరించాడు. యేసు మహాదేవుడని గమనించుము.

యేసు దేవుడని నిదానముగా చేయబడిన ప్రకటన యోహాను 20లో యున్నది. యేసు పునరుత్థానుడైన తరువాత తోమా తప్ప తన అపోస్తులందరికీ ప్రత్యక్షమాయెను. తాము యేసును చూచినట్లు శిష్యులు తోమాతో చెప్పగా ''నేనాయన

చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనని అతడు చెప్పెను (యోహాను 20:25). ఆ మరుసటి ఆదివారమున యేసు మరల తన శిష్యులకు కనబడెను. ఈసారి తోమా కూడ వారితో ఉండెను. ఆయన "తోమాను చూచి, నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమని చెప్పెను. అందుకు తోమా ఆయనతో నా ప్రభువా, నా దేవా అనెను" (యోహాను 20:26-28). ఈ సందర్భములో దేవుడు అను పదముకు Theos అని వాడబడినది. అది యోహాను సువార్తలో పలుమారులు వాడబడెను. అది దేవునికి మాత్రమే వర్తించేపదము. గనుక తండ్రి ఎట్లో, కుమారుడైన యేసు కూడ అట్లే దేవుడని మనకు నిర్దిష్టముగా ప్రకటింపబడినది.

యేసు అల్ఫాయు ఓమేగయునని పిలువబడెను. అనగా ఆయన ఆదియు అంతమునై యున్నాడు. గ్రీకు భాషలో అల్ఫా మొదటి అక్షరము, ఓమెగా ఆఖరి అక్షరము. యెషయా 44:6లో "సైన్యముల కధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చు చున్నాడు. నేను మొదటి వాడను కడపటివాడను. నేను తప్ప ఏ దేవుడును లేడు" అయితే ప్రకటన 1:8లో "అల్ఫాయు ఓమెగయు నేనే, వర్తమాన భూత భవిష్యత్కాలములలో ఉండు వాడను నేనే అని సర్వాధికారియు దేవుడునగు ప్రభువు సెలవిచ్చుచున్నాడు". తరువాత 1:18లో "నేను మొదటి వాడను కడపటివాడను" అని యేసు యోహానుతో చెప్పెను. అదే పేరు ప్రకటన 22:12-13లో యేసుకు మరల వర్తింప జేయబడెను, ఈ పదములు యేసుకు, సర్వాధికారియైన దేవునికి వర్తింపజేయబడెను. గనుక సర్వాధికారియైన దేవుడే యేసుక్రీస్తు. తండ్రియు, యేసుక్రీస్తును సర్వాధి కారియైన దేవుడే ఆదియు అంతమును వారే.

హెబ్రీ 5:9-10లో యేసు తనకు విధేయులైనవారికి నిత్య రక్షణకు కారకుడని చెప్పబడినది. వేరే యేనామమున రక్షణ లేదు. (అపొకా 4:12). దేవుడు తప్ప మానవుల పాపములను ఎవడును క్షమించలేడు. తనకు జన్మించు శిశువుకు యేసు అనుపేరు పెట్టబడవలెనని మరియకు తెలియజేయబడెను; ఏలయనగా ఆయన తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును (మత్తయి 1:21). దేవుడు మాత్రమే చేయునవి క్రీస్తు చేయుచుండినందున యేసుక్రీస్తుదైవ సమానుడు, దేవుడు, యేసు ఇమ్మానుయేలు, అనగా దేవుడు మనకు తోడని యర్థము. కొలస్స 2:9లో "దైవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందు నివసించుచున్నది" యని పౌలు ప్రకటించెను. ఇంకోమాటలో దేవునిలో ఏమైతో యన్నవో అవన్నీ క్రీస్తులో యుండెను. ఇంకోమాటలో తండ్రియైన దేవునివలే క్రీస్తుకూడ సంపూర్ణముగా దేవుడే.

దైవ లక్షణములన్నీ యేసులో యుండెను.

దేవుడెట్లో, యేసు క్రీస్తు కూడా అట్లే నిత్యుడే. యెషయా 9:6లో "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అను గ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్య భారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును" అనియున్నది. ఈ పేర్లన్నియు లేఖనములలో దేవునికి వర్తింప జేయబడెను. హెబ్రీ 1:8లో "దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది" యని చెప్పబడెను. కీర్తన 45 నిశముతగా దేవుని గూర్చి వ్రాయబడినది. మరియు కుమారుడు దేవదూతల కంటే శ్రేష్ఠుడని చెప్పబడినది. అట్లు యేసు దేవుడనే మరొక రుజువు మనము కలిగియున్నాము. ఏలయనగా ఆయన సమస్తమును సృజించిన వాడు (కొలస్స 1:16-18)

యేసు సర్వశక్తుడని ప్రకటింపబడెను. దేవుని వాక్యము సమస్తము సృజించెనని యోహాను 1:3 చెప్పుచున్నది. దేవుడే సమస్తమును నిర్మించినవాడు (హెబ్రీ 3:4). యేసు సమస్తమును సృజించిన వాడు గనుక ఆయనే దేవుడు. ఇలాగా కొలొస్స 1:16లో "సర్వమును ఆయనయందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను, ఆయనను బట్టియు సృజింపబడెను. యేసు సమస్తమును సృజించెను యేసు దేవుడైయున్నారు.

యేసు సమస్తమును ఎరిగియుండెను "యేసు అందరినీ ఎరిగినవాడు గనుక ఆయన తన్ను వారి వశము చేసుకొలేదు. ఆయన మనుష్యుని అంతర్యమును ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్ష్యమియ్యనక్కరలేదు" (యోహాను 2:24-25), దేవుడొక్కడు మాత్రమే మనుష్యుని అంతర్యము నెరిగినవాడు గనుక యేసు దేవుడని ప్రకటింపబడెను.

**దేవుని క్రియలు యేసుకు వర్తించును**

యేసు 5000 మందికి ఆహారము పెట్టిన తరువాత, జీవాహారము నేనేయని ప్రకటించెను (యోహాను 6:48, 51,53-58) యేసు ఆత్మీయాహారమైయుండి మన ఆత్మలకు జీవమునిచ్చు వాడై యున్నారు. మానవమాత్రుడు ఇట్లు చెప్పుకొనలేదు. యేసు పునరుత్థానమును జీవమును నేనేయని చెప్పి చనిపోయిన లాజరును బ్రతికించెను, అనగా జీవమునిచ్చే అధికారము ఆయన కలిగియుండెను "తండ్రి మృతులను ఏలాగు లేపి బ్రతికించునో అలాగే కుమారుడను తనకిష్టము వచ్చిన వారిని బ్రతికించును" (యోహాను 5:21). దేవుడొక్కడు మాత్రమే జీవము నియ్యగలడు గనుక, యేసు జీవము నిచ్చినవాడు గనుక యేసు దేవుడైయున్నారు. తాను సబ్బాతుకు ప్రభువైయున్నానని యేసు ప్రకటించెను (మత్తయి 12:8). దేవుడే

సబ్బాతు నిచ్చెను గనుక సబ్బాతుకు అయనే ప్రభువై యున్నారు.

పలుమారుల తాను దేవునితో సమానుడనని యేసు ప్రకటించెను. నేనును తండ్రియు ఏకమై యున్నామని అయన చెప్పెను (మత్తయి 10:30). అనగా దేవునికిచ్చే ఘనతను అయన పొందనర్హుడని అయన తెలియజేసెను. అయన చెప్పుకొను దానిని యూదులు విపులముగా గ్రహించుకొన్నారు. తాను దేవుడనని చెప్పుకొనుచున్నందున వారాయనను రాళ్ళు రువ్వి చంపాలనుకొన్నారు. యేసుకు తీర్పు తీర్చునప్పుడు ప్రధాన యాజకుడు, "నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆమాట మాతో చెప్పమని" యేసును అడిగాడు (మత్తయి 26:63-64) "నేనే" యని యేసు పలికెను.

పాపములు క్షమించు అధికారము తాను కలిగియున్నానని యేసు వక్కాణించెను, దేవుడు మాత్రమే పాపములు క్షమించగలడని అందరు ఎరుగుదురు. పక్ష వాయువుగల వానిని స్వస్థపరచక ముందు యేసు "నీపాపములు క్షమించబడియున్నవని చెప్పెను" (మార్కు 1:1-12). దేవుడు మాత్రమే ఈ మనుష్యుని స్వస్థపరచగలడు. అయన వానిని స్వస్థ పరిచెను. పాపములు క్షమించెను. ఈ యద్భుతము యేసును దేవుడని నిరూపించెను. అయన మనుష్యులందరికీ తీర్పు తీర్చువాడనని చెప్పుకొనెను." తండ్రి యెవనికిని తీర్పు తీర్చడుగాని తండ్రిని ఘనపరచునట్లుగా అందరు కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించి యున్నాడు" (యోహాను 5:22).

**యేసు ఆరాధన నంగీకరించెను**

యోహాను సువార్త 9వ అధ్యాయములో పుట్టు గ్రుడ్డివానిని యేసు స్వస్థపరచెను. వానికి చూపునను గ్రహించెను. తదుపరి యేసు వానిని కలిసికొని నీవు దేవుని కుమారుని యందు విశ్వాసముంచు

చుచున్నావా? యని అడిగెను. అందుకతడు ప్రభువా నేనాయన యందు విశ్వాసముంచుటకు ఆయన ఎవడని అడుగగా, యేసు నీవాయనను చూచుచున్నావు. నీతో మాట లాడుచున్న వాడు ఆయనే యనెను. అంతటవాడు ప్రభువా నేను విశ్వసించు చున్నానని చెప్పి ఆయనకు మ్రొక్కెను (యోహాను 9:35-38), ఇటువంటి సందర్భ మొకటి మత్తయి 14లో రికార్డు చేయబడెను. యేసు నీళ్ళమీద నడుచుచు రాత్రివేళ శిష్యులు యున్న దోనె యొద్దకు రాగా, దోనెలో యున్నవారు నీవు నిజముగా దేవుని కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:33).

యేసు మనుష్యుల ఆరాధనను అంగీకరించెను. ఆయన కేవలము మానవ మాత్రుడే అయితే నిష్టగల యూదుడెవ్వడు ఆయనను ఆరాధించడు, దేవుడొక్కడు మాత్రమే ఆరాధనీయుడని యూదులందరు ఎరుగుదురు. ఆయన దేవుడు కాకపోతే ఆయన ఎన్నడు మానవుల ఆరాధనను అంగీకరించరు. సరిగదా యూదులు ఆయనకు మ్రొక్కరు.

దేవుడు ఆయన కుమారుడు ఆరాధింపబడవలెనని దూతలకాజ్ఞా పించినట్లు మనము చూడగలము. "మరియు ఆయన భూలోకమునకు ఆది సంభూతుని మరల రప్పించి నప్పుడు దేవుని దూతలందరు ఆయనకు ఆరాధించవలెనని (నమస్కారము చేయువలెనని) చెప్పుచున్నాడు" (హెబ్రీ 1:6). ఈ వచనము ద్వితీయోపదేశ కాండము 32:43, కీర్తన 97:7లో చెప్పబడినది. ఆది సంభూతుడనగా దేవుని కుమారుడైన యేసుక్రీస్తు. దేవుడు కాని వానిని ఆరాధించుమని దేవుడు దూతలకు ఎన్నడు ఆజ్ఞాపింపరు.

**ముగింపు**

యేసు దేవుడని బోధించు అనేక లేఖనభాగములను మనము ఇంకా చూపించవచ్చును. గాని యివి సరిపోవును. బైబిలును విశ్వసించు విజ్ఞత గల వాడెవడైనను యేసు తండ్రివలె దేవుడై యున్నారని తప్పక విశ్వసించును.

- జెర్రీబేట్స్

# దేవునిచే పంపబడిన మనుష్యుడు

## (God Sent Man)

దేవునిచే పంపబడిన మనుష్యుని గూర్చి మతశాఖల వారు తరుచు చెబుతారు. కొందరేమో తామే దేవునిచే పంపబడిన వారమని చెప్పుకొంటారు. అయితే బైబిలును తన చంకలో బెట్టుకొని కనబడు ప్రతివాడు దేవునిచే పంపబడిన వాడుకాదు. దేవుడతని పంపలేదు. అతని బోధనుకూడా ఆయన అనుమతించరు.

### యేసు దేవునిచే పంపబడెను

దేవునిచే పంపబడిన వానిని గుర్తించుట ఎట్లో నీకు తెలుసా? దేవునిచే పంపబడినవాడు దేవుని మాటలే పలుకునని యోహాను 3:34లో మనము చదువగలము. మరియు యోహాను17:17లో "నీ వాక్యమే సత్యమని" యేసు ప్రభువు చెప్పెను. యేసుక్రీస్తు దేవునిచే పంపబడినవాడని నీకోదేము గుర్తించెను. "బోధకుడా నీవు దేవుని నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదమని" అతడు చెప్పాడు (యోహాను 3:2). యేసుక్రీస్తు దేవునిచే పంపబడినవాడని అపొస్తలుడైన యోహాను ప్రకటించాడు. "దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను" అని 1 యోహాను 4:9లో అతడు చెప్పాడు. "నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నాయొద్దకు రాలేడు" అని యోహాను 6:44లో యేసు చెప్పెను. అవును యేసు ప్రభువు దేవునిచే పంపబడినవాడు ఆయన దేవుని మాటలనే పలికెను. ఏ బోధకుడైనా దేవునిచే పంపబడిన వాడైతే అతడు దేవుని మాటలనే పలుకును. "దేవుని యొద్ద నుండి పంపబడిన యొక మనుష్యుడుండెను. అతని పేరు యోహాను" అని యోహాను 1:6లో మనము చదువగలము. అపొస్తలులు దేవునిచే పంపబడినవారు. "మీకు సమాధానము కలుగనుగాక, తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నానని" యేసు వారితో చెప్పెను (యోహాను 20:21)

**అపోస్తలులు దేవునిచే పంపబడిరి**

లోకమంతటికి అపొస్తలులు సువార్త ప్రకటించారు. యేసు ప్రభువు అపోస్తలులకు గొప్ప ఆజ్ఞనిస్తూ, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని చెప్పెను" (మార్కు 16:16). దేవునిచే పంపబడిన అపొస్తలులు అట్లే బోధించారు. అయితే నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని నేటి మతశాఖల బోధకులు బోధించరు. సరిగదా నమ్మి రక్షించబడినవాడు బాప్తిస్మము పొందవచ్చునని వారు బోధిస్తారు. అందువలననే వారు దేవునిచే పంపబడిన వారు కాదని మనం గ్రహించుకొనగలము.

సువార్త రక్షించుటకు దేవుని శక్తియై యున్నదని దేవుని వాక్యము బోధించు చున్నది (రోమా 1:16). సువార్త ప్రకటించుట ద్వారా మానవులు రక్షించబడుదురు (1 కొరింథీ 1:21). అయితే సువార్త బోధింప బడకుండగనే పరిశుద్ధాత్మ ప్రభావము వలన మానవులు రక్షింపబడతారని కొందరు బోధిస్తారు. అందువలన అట్టివారు దేవునిచే పంపబడని వారని నేనెరుగుదును. దేవునిచే పంపబడిన వాడగు పౌలు (1 కొరింథీ 1:1), "ప్రభువైన యేసు తన ప్రభావమును కనవరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునని" చెప్పెను (2 థెస్స 1:7-9). మరికొంతమందేమో రక్షింపబడాలంటే సువార్తకు లోబడ నక్కరలేదని, విశ్వాసముంటే చాలునని బోధిస్తారు. అందువలన వారు దేవునిచే పంపబడిన వారుకారని నేనెరుగుదును. ఏల యనగా దేవునిచే పంపబడినవాడు దేవుని మాటలనే పలుకును.

**దేవునిచే పంపబడినవారు దేవుని మాటలనే పలుకుదురు**

దేవునిచే పంపబడిన వాడగు పేతురు, పెంతెకోస్తునాడు ప్రజలకు "మీరు మారుమనస్సు పొంది,

పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" యని చెప్పెను (అపొ.కా. 2:38). అయితే మతశాఖల బోధకులు నేడు అట్లు బోధించరు. గనుక వారు దేవునిచే పంపబడలేదని నేనెరుగుదును. దేవునిచే పంపబడిన వాడు మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రజలు బాప్తిస్మము పొందాలని చెప్పాడు. దేవునిచే పంపబడిన వ్యక్తి ఆయన మాటలనే పలుకుతాడు. ఏలయనగా దేవునిచే పంపబడిన వాడు దేవుని మాటలనే పలుకును (యోహాను 3:34).

సంఘము క్రీస్తు యొక్క శరీరమని పౌలు బోధించాడు (కొలస్స 1:18). ఆ ఒకే శరీరములో అనేకములైన అవయువములున్నాయని కూడా అతడు చెప్పాడు (1 కొరింథీ 12:20). సంఘము క్రీస్తు శరీరమైనందున, క్రీస్తుకు ఒకే ఒక్క శరీరమున్నందున, ఆయనకు ఒకే ఒక్క సంఘమున్నది. గాని మతశాఖల బోధకులైతే క్రీస్తుకు కొన్ని వందల శరీరములన్నాయని చెబుతారు. వందల కొలది శరీరములున్నాయని చెప్పేవారు. దేవునిచే పంపబడిన వారుకారు. క్రీస్తుకు కనీసము రెండు శరీరాలున్నాయని ఎవడైనా చెబితే వాడు దేవునిచే పంపబడినవాడు కాదు. అట్టివారికేమి జరుగుతాది? గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి త్రోవ చూపిన యెడల వారిద్దరు గుంటలో పడుదురని యేసు బోధించారు. అందువలన మనం జాగ్రత్తగా యుండి ఆయా ఆత్మలు (బోధలు) దేవుని సంబంధమైనవో కావో పరీక్షించాలి (1 యోహాను 1:4)

-జాన్ హేరిస్

## క్రిస్మస్ పండుగ
## (Christmas Festival)

డిశంబర్ 25న యేసుక్రీస్తు జనన మహోత్సవము జరుపుకొనుట కొందరికి వాడుక.

యేసుక్రీస్తు తాను జీవించి ఉన్న కాలములో అనగా $33^1/_2$ సంవత్సరములలో ఎన్నడును పుట్టుక

దినము జరుపుకున్నట్టు చూడలేము. క్రిస్మస్ పండుగను గూర్చి పరిశుద్ధ గ్రంథములో ఏ ఒక్క వచనములోను మనకు కనిపించదు. అలాంటప్పుడు క్రీస్తు జన్మదినము డిశంబర్ 25 అంటూ ఏ ఆధారము లేకుండా ఆ రోజున పండుగ దినముగా ఆచరించుట విచారకరము.

క్రీస్తు పుట్టకమునుపు కూడా డిశంబర్ 25న పర్వదినముగా తమ్మూజు పుట్టుకదినముగా ఆచరించేవారు. నిమ్రోదు రాజు... యెహోవా యెదుట పరాక్రమము గల వేటగాడు. ఆనాటి కాలములో ప్రజలందరు నిమ్రోదును గూర్చి తానొక గొప్పవాడని చెప్పుకొనేవారు - బాబెలు గోపురాన్ని కూడ అతడే నిర్మించెను (ఆది 10:8-12, 11:1-9).

ఈ నిమ్రోదును గూర్చియు, తన భార్యను గూర్చియు తెలుసుకొనవలెనంటే మనము బైబిలును గాక వారిని గూర్చిన 'చరిత్రను' చూడవలెను. ఈ నిమ్రోదు భార్యపేరు సెమిరామిస్ అని 'చరిత్రలో' వ్రాయబడి యున్నది. ఆమె పేరు సెమిరామిస్, అదే పేరునకు 'ఆష్టాలీ' 'ఆష్టోరెట్' అనే నామాంతరాలు కూడ ఉన్నాయి. ఈమె ఊహామాత్రమైన ఆకాశరాణి, జనులామెకు ధూప, నైవేద్యాలు చేసేవారు (యిర్మియా 44:17-23.)

ఒక దినమున నిమ్రోదు వేటకు వెళ్ళినప్పుడు క్రూరమృగాలు అతనిని చంపివేసాయి. ఆ తరువాత సెమిరామిస్ ఆ నిమ్రోదే శిశువుగా తన గర్భములో ప్రవేశించాడని ప్రకటించింది. ఆ శిశువు పేరే తమ్మూజు (యెహెజ్కేలు 8:13-16).

ఆ శిశువు పుట్టినప్పుడే అనగా డిశంబర్ 24న, నిత్యము పచ్చగా వుండే ఒక చెట్టు కూడ రాత్రికి రాత్రే మొలచినట్టుగా చూపించింది. తమ్మూజ్ దగ్గర రకరకాల కానుకలు వుంచింది. నిమ్రోదే ఆ రూపములో సూర్యదేవర శరీరధారి అయినట్టు రూపకల్పన గావించింది. దాని ప్రకారమే యూల్ అను సూర్యదేవుని పండుగ దినమును క్రీస్తు పుట్టుక దినముగా మార్చుడమువలనే క్రిస్మస్ పచ్చింది.

క్రొత్త నిబంధనలో లేని క్రిస్మస్ పండుగ ఏలాగు అమలులోనికి వచ్చెను? తెలుసుకుందము. వాటి ఆరంభరీతి నెరుగుటకు మనము బైబిలును గాక, క్రిస్మస్ చరిత్రను చూడవలెను. క్రీ॥శ॥ 400 సం॥లో నుండియే క్రిస్మస్ పండుగ అమలులోనికి వచ్చెను.

కాన్‌స్టాంటైన్ అనే రోమా చక్రవర్తి ఒకసారి అతడు యుద్ధానికి వెళుతూ తను క్షేమముగా యుద్ధ భూమి నుండి తిరిగి రాగలిగితే ఆ సమయానికి ఏ దేవుడైతే తనకు సాక్షాత్కరిస్తాడో ఆ దేవునిని అనుసరిస్తానని అనుకున్నాడు. అతడు యుద్ధభూమి నుండి క్షేమముగా తిరిగి వస్తుండగా ఆకాశవీధిలో ఒక సిలువగుర్తు అతనికి కనిపించిందట. అంతవరకు క్రైస్తవులను హింసించిన ఆ రోమా చక్రవర్తి క్రైస్తవ్యాన్ని స్వీకరించి, క్రీస్తు జన్మదినాన్ని డిశంబరు 25న ఆచరిస్తారని తెలుసుకొని ఆ తేదీని క్రీస్తు జన్మదినముగా ప్రకటించి, అప్పటి వరకు ఏ పండుగను చెయ్యని క్రైస్తవులను క్రీస్తు జన్మదినాన్ని చెయ్యమని వత్తిడి చేసాడు. ఈ విధముగా 'క్రిస్మస్' పండుగ ఆచరణలోనికి వచ్చినట్లు 'చరిత్ర' సాక్ష్యము చెప్పుచున్నది.

ఆనాటి కాలములో చక్రవర్తులు, రాజులూ క్రైస్తవులుగా మారినారు. ఆ కారణములవలన ఆనాడు సెలవు దినముగా ప్రకటించినారని "చరిత్ర" చెప్పుచున్నది. క్రిస్మస్ పండుగ అనుమాట రోమన్ చక్రవర్తి కాన్‌స్టాంటయిన్ క్రైస్తవునిగా మారిన నాలుగోవ శతాబ్దములో నుండియే వింటున్నాము. గాని అంతక ముందెన్నడూ దానిని ఆచరించినట్లు కనబడదు.

**క్రీస్తు జనన తేదీ ఎవరీ తెలియదు.**

దైవ గ్రంధమును, సామాజిక చరిత్రను... తరచిని పండితులే నేటి వరకు క్రీస్తు పుట్టుక తేదిని నిర్ణయించలేక యున్నారు. అయితే రోమన్ కేథలిక్కు వారితో ప్రొటెస్టాంటు శాఖలవారు దానిని ఆచరించడము విచారకరము.

ప్రపంచములోని ప్రొటెస్టాంట్ క్రైస్తవులు అనబడువారు నూటికి

తొంభై శాతము క్రీస్తు డిశంబరు 25న పుట్టినాడని భావించి క్రిస్మస్‌ను ఆచరిస్తూ ఉండుట మనము చూస్తున్నాము. క్రిస్మస్‌ను గూర్చిన అవగాహన లేకనే కొందరు దానిని ఆచరించుచుదురు. ప్రొటెస్టాంటులు ఎవరనగా కేథలిక్కు నుండి వేరైనవారు.

మరొక సంగతి, యేసుక్రీస్తు చేసిన అద్భుతములు 41, యేసుక్రీస్తు జన్మము, మరణము, పునరుత్థానము, ప్రవచనములు 38. వీటిలో క్రీస్తు జన్మదినమున ఒక చెట్టు మొలచినట్లుగా ఏ ఒక్క ప్రవచనములలో వ్రాయబడలేదు. ఈ చెట్టు 'చరిత్ర' అన్యులు తమ్ముజ్ జన్మదినమున మొలచినట్టుగా సెమిరామిస్ చెప్పెను (యోహాను 20:30-31 చదవండి).

అదొక రోమియుల పండుగ

డిశంబరు 25న ఒక పండుగగా క్రీస్తు పుట్టుకకు పూర్వమే రోమన్లు ఆచరించినట్లు 'చరిత్ర' చెప్పుచున్నది. ఆకాశరాణి అను ఒక దేవత వలన డిశంబరు 25న సూర్యుడు పుట్టినాడని వారు నమ్ముదురు. బబులోనీయులు కూడ దీనిని 5 దినములు ఆచరిస్తారు. ఐగుప్తీయులు డిశంబరు 25న సూర్యదేవునికి, చంద్రదేవతకు నక్షత్రదేవుడు పుట్టినాడు అనివారు ఆ తేదీను పండుగగా ఆచరిస్తారు. అరేబియాలో సెబియర్ అను జాతివారు చంద్రదేవతను ఆరాధిస్తారు, చంద్రుడు డిశంబరు 24న పుట్టినాడని నమ్ముదురు. ఈలాగున అన్యదేవతల జన్మదినమైన డిశంబరు 25న క్రీస్తు పుట్టుక దినముగా జరుపుకొనుట వింతగానే యున్నదని వారు ఆలోచించరు.

పాత నిబంధనలో నుండి ఇశ్రాయేలీయులు అనుసరించే పండుగలు. పంటచేని పండుగ, పులియని రొట్టెల పండుగ, ఏడు దినములు పర్ణశాలల పండుగ, ఏబది దినములు లెక్కించి పెంతెకొస్తు పండుగ ఇంక ఎన్నో పండుగలు ఉన్నవి (ద్వితీ 16:9-17; నిర్గమ 12:17-20, 23:14-17; లేవీయ 23:15-42; అపొ.కా. 2:1) ఈ పండుగలు కేవలము ఇశ్రాయేలీయులకు

దేవుడు ఇచ్చెను గాని అన్యులకు యివ్వలేదు (కీర్తన 147:19-20; ద్వితీ 5:1-22; నిర్గమ 20:1-17; ఎఫెసీ 2:12-20).

యేసు యూదా గోత్రములో పుట్టి ధర్మశాస్త్రమునకు లోబడి యున్నవారిని విడిపించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను (గలతీ 4:4-5; లూకా2:21-39). ఆ పండుగలను, విధిరూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును యేసు తన శరీరమందు కొట్టివేసెను (ఎఫెసీ 2:14-16:2 కొరింథీ 3:14-16; హెబ్రీ 8:7-13; 1 కొరింథీ 5:6-8, యిర్మీయా 31:31-34).

ఈ పండుగలు అన్నియు క్రీస్తు సంఘము అమలులోనికి వచ్చువరకు ఉండెను. క్రీ॥శ॥ 33 సం॥లో యెరూషలేములో క్రొత్త నిబంధన సంఘము అనగా క్రీస్తు సంఘము ఆరంభమైనది. అపొస్తలుల ఆరాధనలో పాత నిబంధనలోనున్న పండుగలు వారు అనుసరించినట్లు ఎక్కడ వాక్యము కనిపించదు.

కొందరు క్రైస్తవులు పాత నిబంధనలోనున్న పండుగలు వాటిని పారంపర్యముగా ఆచరించుట చూచి పౌలు ఖండించెను. ఎట్లనగా మీరు పండుగ అమావాస్య విశ్రాంతి దినము ఆచరించుచున్నారు. ఇట్టి ఆచారములు చేయవద్దు - ముట్టద్దు అను విధులకు మీరు లోబడనేల? అవన్నియు వాడకొనుటచేత నశించి పోవును (గలతీ 4:8-12, కొలస్స 2:16-23).

ఇశ్రాయేలీయులకు ఆయా పండుగలు చేయమని చెప్పిన దేవుడే ఆమోను కాలములో వాటిని చేయవద్దని చెప్పెను (ఆమోసు 5:21). మేము ప్రకటించిన సువార్త గాక, మరియొక సువార్తను ఎవడైనను మీకు చెప్పిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక (గలతీ 1:6-12). యేసు ఇట్లనెను, ఈ ప్రజలు మనుష్యులు కల్పించిన పద్ధతులను... అనుసరించి వారు నన్ను వ్యర్ధముగా ఆరాధించుచున్నారు (మత్తయి 15:7-9, 21-27, లూకా 6:46)

కీ॥శే॥ వై. తాతారావు, బరంపురం, ఒరిస్సా.

# సంక్షిప్త వార్తలు

2019 నవంబరు 26, 27 తేదీలలో రాజమండ్రి, జె.కె. గార్డెన్స్‌లో ఆల్ ఇండియా ప్రీచర్స్ సహవాసకూడికలు జరిగెను. అవి క్రీస్తుసంఘము లలోని రెండవతరము వారు నిర్వహించిరి. ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, పంజాబ్, ఢిల్లీ, కేరళ మొదలగు అనేక రాష్ట్రముల నుండి వందలాది సువార్తికులు తరలివచ్చిరి. దూరప్రాంతముల నుండి వచ్చిన వారికి చక్కటి ట్రాన్సుపోర్టు, వసతి సౌకర్యములు కల్పించిరి. యేసుక్రీస్తు యొక్క దైవత్వముపై ఆధారపడి ఇంచుమించు 12మంది సహోదరులు వాక్యపరిచర్యచేసిరి. 27వ తేదీ సాయంకాలానికి ఈ సహవాసకూడిక జయకరముగా ముగిసెను.

2019 నవంబరు 20వ తేదీ నుండి 28వ తేదీ వరకు రిక్కీ గూటం గారు మలేషియా, ఫిలిప్పీన్స్ దేశములు పర్యటించి 27వ తేదీ రాత్రికి కాకినాడకు సురక్షితముగా చేరుకొనిరి.

2019 నవంబరు 28,29,30 తేదీలలో కాకినాడ, జగన్నాధపురం చర్చిస్క్వేర్ క్రీస్తుసంఘము సువార్తకూడికలు నిర్వహించిరి. ఆ కూటములలో రిక్కీగూటం, పి.ప్రవీణ్, జాన్‌రత్నం, నెహెమ్యా గూటం, కె.జి.కుమార్, జాన్ ఆనంద్ మరియు యమ్. జాన్‌డీన్ గార్లు వాక్యపరిచర్య చేసిరి. వందలాది మంది ప్రతిరాత్రి హాజరైరి. అందరికీ భోజనము వసతి కల్పించ బడెను. సహో.టి.జ్ఞానసుధీర్ గారు ఈ కూటములను సమర్ధవంతముగా, జయకరముగా నిర్వహించిరి.

2019 డిశంబరు 2 నుండి 4వ తేదీ రాత్రి వరకు కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘములో బైబిలు లెక్చర్‌షిప్ జరిగెను. పలు పట్టణములు, గ్రామముల నుండి వందలాది ప్రజలు హాజరుకాగా సత్యవాణి ఆవరణ అంతయు జనసమూహతో కిటకిటలాడెను. సహో. ఎరిక్ గారు (అమెరికా), గంధం శ్యామ్ సుందర్ (చెన్నై), యస్. రాజా నాయకం (కంగయాం, తమిళనాడు), రోనీ గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. ఎరిక్ గారు గలతీ

పత్రిక నుండి, శ్యామ్ గారు ఎఫెసీయుల పత్రిక నుండి. రోనీ గారు విలాపవాక్యముల నుండి, రాజానాయకం గారు బైబిలులోని ప్రాముఖ్యాంశములు నుండి చక్కటి పాఠములను ఉపదేశించిరి. రెండవ దినమున తెలంగాణా నుండి వచ్చిన ఒక డినామినేషనల్ దంపతులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆ నాలుగు దినములలోను దేవుడు చక్కటి వాతావరణము ననుగ్రహించారు. రిక్కీ గూటం గారు ఈ గొప్ప కార్యభారమును సమర్ధవంతముగా వహించి నడిపించిరి. హాజరైన వారందరికీ మంచి రుచి, శుచి గల భోజనపానాదులు, వసతి ఏర్పాటు చేయబడెను. సభలు సోదరులు జ్ఞానసుధీర్ గారి ప్రార్ధనతో ముగిసెను.

డిశంబరు 17,18 తేదీలలో రోనీగూటం గారి ఆధ్వర్యములో సత్యవాణి ఆవరణలో ప్రతేక బైబిలు తరగతులు నిర్వహించబడును. ఆసక్తిగలవారు తప్పక హాజరు కాగలరు.

**RIN Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2018-2020**

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533001

Date of Publication : 9th of Every Month
Date of Posting : 15th of Every Month

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004